క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవ యాగం



కన్నాపురం శివాలయం వద్ద నిర్వహిస్తున్న హోమం

కొయ్యలగూడెం: కన్నాపురం శ్రీదుర్గా అన్నపూర్ణ సమేత రసలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం ఆలయ వార్షిక మహోత్సవం, వైశాఖమాస ఏకాదశి పురస్కరించుకొని దేవేరులతో సహా స్వామివారికి కల్యాణ మహోత్సవం, ప్రత్యేక హోమాలు అర్చకులు చిట్టా ప్రగడ మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయం నిర్మించి 40 ఏళ్లు పూర్తయినట్టు అర్చకులు తెలిపారు. భక్త దంపతులుచే హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



అయ్యప్ప స్వామి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి మండపారాధన, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పములు తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత నాగేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న హయగ్రీవ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భీమవరానికి చెందిన పోలిశెట్టి నాగేశ్వరరావు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. నాగేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి 61వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. స్వామివారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించారు. 14వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 11న స్వామి, అమ్మవార్లకు రాత్రి 9 గంటలకు కల్యాణం, 12న స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భారీగా ఉపనయనాలు, వివాహాలు



క్షేత్రంలో ఉపనయన వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గురువారం ఉపనయనాలు, వివాహాలు భారీగా జరిగాయి. మంచి ముహూర్తం కావడంతో అనివేటి మండప ప్రాంతం, కొండపైన దేవస్థానం కల్యాణ మండపాల్లో ఈ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. శుభముహూర్త సమయంలో వటువులకు శాస్త్రోక్తంగా యజ్ఞోపవీత ధారణ చేశారు. స్వామివారి పాత కల్యాణమండప ప్రాంతం, ప్రైవేట్ పంక్షన్ హాళ్లలో వివాహాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వేడుకలు పూర్తయిన తర్వాత వటువులు, అలాగే పెళ్లి బృందాలు స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి.

ఏపీలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు

- 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు తగవు
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



మల్లెల చంటినాయుడు

బుట్టాయగూడెం: నోటీసులు ఇవ్వకుండానే సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏపీలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నించినందుకే సాక్షి పత్రికపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వంలో జరుగుతోన్న అక్రమాలను నిగ్గతీసి అడుగుతున్నందుకు కక్షగట్టి ప్రజల గొంతులను నొక్కాలని చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే కూటమి ప్రభుత్వం ఇదంతా చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలని హితవుపలికారు. ఈ దుర్మార్గపు చర్యలను మానుకోకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని బాలరాజు పిలుపునిచ్చారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి

కుక్కునూరు: ప్రభుత్వం సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిలో నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయించడం పత్రికా స్వేచ్ఛపై దాడేనని సోషల్ మీడియా పోలవరం నియోజకవర్గ కన్వీనర్ మల్లెల చంటినాయుడు ఆరోపించారు. ప్రభుత్వ అవినీతిని బయటకు రానివ్వకుండా చేసేందుకు పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుందని విమర్శించారు. పత్రికా ప్రతినిధులపై ఇటువంటి చర్యలకు పాల్పడి, వారిని మానసికంగా వేధించి, వారి గొంతునొక్కే ప్రయత్నం చేయడం తగదని పేర్కొన్నారు. ప్రతికా స్వేచ్ఛను హరించాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'సాక్షి'పై కక్ష సాధింపు

చింతలపూడి : కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛను హరించే కార్యక్రమాలు ఎక్కువయ్యాయి. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డికి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇంటిలో సోదా చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు సీఐ రాజశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్కే ఆజాద్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రోజురోజుకు పెరుగుతోన్న జర్నలిస్ట్‌లు, పత్రికా కార్యాలయాలు, ఎడిటర్లపై దాడుల కట్టడికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే అన్నారు. కార్యక్రమంలో సాక్షి సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే అమీర్ పాషా, పాత్రికేయులు మోగపర్తి కృపావరం, సంజయ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. అయ్యప్ప టౌన్‌షిప్, పేరంపేట రోడ్డు, బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీ, పేరంపేట రోడ్డులోని ఇండస్ట్రీయల్ సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలో..

చింతలపూడి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సీతానగరం ఫీడర్, అల్లిపల్లి సబ్ స్టేషన్, లింగగూడెం సబ్ స్టేషన్ పరిధిలో గల చింతంపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో..

కొయ్యలగూడెం: స్థానిక బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.అహ్మద్ ఖాన్ తెలిపారు. బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్క్ పనులకు శంకుస్థాపన

చింతలపూడి : ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పదంలో నిలిపేందుకు జిలాల్లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్‌ను నెలకొలుపుతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. చింతలపూడి మండలం పట్టాయగూడెంలో 70 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్క్ పనులకు గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. సబ్ కలెక్టర్ స్మరన్ రాజ్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, సర్పంచ్ వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికా వికాసం



కిశోర బాలిక వికాస అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక కాలింగుల పేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలిక వికాస అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై పాటించాల్సిన ఆరోగ్య పద్ధతులు, డేట్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కమిటీ సభ్యులు బి.ఆశాజ్యోతి, జి.ప్రియంవద, ఎస్ వెంకటలక్ష్మి, కె.కృష్ణవేణి, శ్రీదేవి, కిశోర బాలికలు హాజరయ్యారు.

జగన్ 2.0 పాలన తథ్యం

మాజీ ఎమ్మెల్యే బాలరాజు



బయ్యనగూడెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలన తథ్యమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామంలో మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారని, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని వివరించారు. కార్యకర్తల అభీష్టమే ప్రధానంగా జగన్ ప్రజల మధ్యకు రాబోతున్నారని వెల్లడించారు. పార్టీకి పోలవరం కంచుకోట అనేది నిరూపించాలని, స్థానిక ఎన్నికల్లో అందుకు శ్రీకారం చుట్టాలని బాలరాజు కోరారు. కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను సైతం నిర్వహించడానికి జంకే పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, గ్యాంబ్లింగ్ పెచ్చు మీరాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. అనారోగ్య కారణాలతో కార్యకర్తలకు అందుబాటులో లేకుండా ఉన్న పరిస్థితులను సరిదిద్దుకుంటానని చెప్పారు. పార్టీ నాయకులు గంటా శీను, దాసరి విష్ణు, గంజిమాల రామారావు, చిటికెన శ్రీను, తోట జయబాబు, ఎస్కే బాజీ, తాడిగడప రామకృష్ణ, మారిశెట్టి శ్రీను, జొన్నకూటి పట్టియ్య, దూలపల్లి కాంతారావు, ఏలేటి చంద్రం, టీడీపీ రవి తదితరులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): అడవుల పరిరక్షణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ బంజారా భజరంగీ భేరి సంఘం నాయకులు జిల్లా అటవీ అధికారికి గురువారం వినతి పత్రం అందజేశారు. అడవులను కొందరు దుండగులు తగలబెట్టడం, నరికివేయడం వల్ల అంతరించిపోతున్నాయని, దీంతో జీవ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అడవుల పరిరక్షణకు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, అడవులను పెంచడానికి వర్షాకాలంలో బంజారా భజరంగి భేరి సంఘానికి అటవీ శాఖ నుంచి విత్తనాలు, మొక్కలు ఇవ్వాలని కోరారు. వీటిపై అటవీ శాఖ జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారని నాయకులు భూక్యా నాగరాజు నాయక్, జరభల వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు.

టయోటా షోరూమ్ ప్రారంభం



టయోటా షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం : అధీకృత డీలర్ పృథ్వి టయోటా ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్‌లో ఏర్పాటుచేసిన టీ - స్పర్శ్ షోరూమ్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ప్రారంభించారు. షోరూమ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి, వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పృథ్వి టయోటా సీఈఓ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నూతన షోరూమ్‌లో అన్ని రకాల టయోటా వాహనాల ప్రదర్శన ఉంటుందని, టెస్ట్ డ్రైవ్ సౌకర్యం ఉందని చెప్పారు. బుకింగ్స్ స్వీకరించడంతో పాటు డెలివరీ కూడా ఇక్కడే ఇస్తామని, జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీసీబీ మాజీ సభ్యులు కరాటం రాంబాబు, రావూరి కృష్ణ, టయోటా ఏరియా మేనేజర్ చమన్ శర్మ, ఎండీ పృథ్వి చంద్ర, జీఎం భాను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణ మహోత్సవాలు



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



బోడిగూడెంలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

పోలవరం రూరల్: పోలవరం మండలంలో శ్రీపద్మావతి అలివేలు మంగా సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పోలవరం, బోడిగూడెం, పాత పట్టిసీమ గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణ మహోత్సవాలను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. పోలవరం గ్రామంలోని నూతన ఆలయంలో వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేపకాయల రాంబాబు, శ్రీదేవి దంపతులు నిర్వహించారు. సాయంత్రం కల్యాణ మహోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బోడిగూడెం గ్రామంలో శ్రీ గిరి పర్వతంపై నిర్వహించిన వెంకటేశ్వస్వామి కల్యాణ మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. బోడిగూడెం గ్రామంలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేసినట్టు ఆచార్యులు బూరుగు వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టిసం గ్రామంలోనూ స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు.

మహిళాభివృద్ధే లక్ష్యం



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం : మహిళాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి మహిళా ఒక వ్యాపార వేత్త కావాలనే లక్ష్యంతో పనిచేస్తుందని, వారికి అర్బన్ ఏరియాలో మెప్మా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీ పథకాలు అందించి, తద్వారా వారి అభివృద్ధికి బాటలు వేస్తుందని వివరించారు. మహిళలు తయారు చేసిన వాటిని ఈ మార్కెట్ ద్వారా అమ్ముకోవచ్చని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొని మెప్మా మహిళలను అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, రావూరి కృష్ణ, రామలింగేశ్వరరావు, రామచంద్రరాజు, రామ్‌కుమార్, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, ఇతర ముఖ్య నాయకులు, మెప్మా టీఎంసీ నాగమణి పాల్గొన్నారు.

పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిగూడెంకు చెందిన గంజి వినోద్‌కుమార్ జంగారెడ్డిగూడెం పట్టణంలో డ్రై ఫ్రూట్స్ షాపు నడుపుతున్నాడు. ఈనెల 2న వినోద్‌కుమార్ తన షాపు వద్ద స్నేహితుడు మోసెస్‌తో కలిసి మద్యం తాగుతుండగా, పట్టణానికి చెందిన మానుకొండ కిషోర్, మొల్లా సురేశ్, పైడిమాల ప్రణయ్, ప్రగడ నారాయణలు దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో పాటు, చంపుతామని బెదిరించారు. దీనిపై వినోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈనెల 2న స్థానిక అశ్వారావుపేట రోడ్‌లో శ్యాంసంగ్ షోరూం వద్ద పట్టణానికి చెందిన మొల్లా సురేశ్, పైడిమాల ప్రణయ్‌లను పంగిడిగూడెంకు చెందిన గంజి వినోద్‌కుమార్, మోసెస్‌లు అసభ్యకరంగా మాట్లాడి తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో నేకూరి కిషోర్, వినీత్ అనే వ్యక్తులు ప్రణయ్‌కు ఫోన్‌చేసి హైదరాబాద్ నుంచి కొందరు వ్యక్తులు వచ్చారు, ప్రణయ్‌ను చంపేస్తామని బెదిరించినట్టు పోలీసులకు ప్రణయ్ ఫిర్యాదు చేశారు. దీనిపై గంజి వినోద్‌కుమార్, వర మోసెస్, నేకూరి కిషోర్, కొత్తూరి వినిత్ వర్మ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన బశీదు రాహుల్, ముట్టబోయిన సాయి, ఎస్ నరసింహ అనినాష్, బూడిద ప్రేమ్‌కుమార్‌లపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గిజిగాడి గూళ్లు



ప్రస్తుత రేడియేషన్ల ప్రభావంతో పిచ్చుకలు కనుమరుగవుతున్నాయి. జనసంచారాలు లేని మారుమూల ప్రాంతాల్లో అవి గూళ్లు నిర్మించుకుని తమ ఉనికిని చాటుకుంటున్నాయి. కిలకిలారావాలతో అచ్చుతాపురం సమీపంలో కనువిందు చేస్తున్న గిజిగాడి గూళ్లివి. వాటి సందడికి అటువైపు వెళ్లే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - కొయ్యలగూడెం

చిట్టిబాబును పరామర్శించిన విజయరాజు



ప్రసన్న లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయరాజు

చింతలపూడి : ప్రగడవరం పంచాయతీ వెలగలపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు గోలి చిట్టిబాబు భార్య ప్రసన్న లక్ష్మి సంస్మరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పాల్గొని నివాళులర్పించారు. చిట్టిబాబుకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, నాయకులు తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎం ఇమ్మానియేలు, ఎ.సుబ్బారావు, కె.ఏలియ్య, ఎస్ దుర్గారావు, పి.మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కుక్కునూరు: మండలాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండేలా స్థానికంగానే నివాసం ఉండాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశించారు. గురువారం ఆయన కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు, నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



రాజకుమారికి చెక్కు అందిస్తున్న దృశ్యం

లింగపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి తల్లిదండ్రులకు ధర్మాజీగూడెం ఎస్‌బీఐ అధికారులు గురువారం ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ధర్మాజీగూడెంకు చెందిన చంద్రు ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రజనీకాంత్, ఆర్ఎం ప్రసాద్ ఇన్సూరెన్స్ కవరేజ్ అమౌంట్ రూ.10 లక్షల చెక్కును ప్రవీణ్‌కుమార్ తల్లి రాజకుమారికి ధర్మాజీగూడెం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అందజేశారు.

యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగోళ్ల వెంకట కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లపాటు రూ.15 వేల కోట్లు భారం వేసే ఒప్పందానికి విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ఆమోదం తెలపడం అన్యాయమని పేర్కొన్నారు.

పహల్గాం దాడి దురదృష్టకరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి దురదృష్టకరమని, ఈ దాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నగరానికి చెందిన హిందూ యువజన సంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. గురువారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన సంతాప సమావేశంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్ పాల్గొన్నారు.